# అడవులను కాపాడుకుందాం..

## ధ్వంసం చేస్తే మానవ మనుగడకే ముప్పు


అటవీశాఖ అధికారులతో కలిసి ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి

- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి
- పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి
- హరిత తెలంగాణే కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యం
- 'తెలంగాణ హరితోత్సవం'లో సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి
- మొగులాన్‌పల్లి తండా శివారులో మొక్కలు నాటిన స్పీకర్

బాన్సువాడ రూరల్, జూన్ 19 : అడవులను ధ్వంసం చేయకుండా వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని హరితవనంగా తీర్చిదిద్దేందుకే సీఎం కేసీఆర్ తెలంగాణకు హరితహారం అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. హరితహారంలో భాగంగా రాష్ట్రంలో ఎనిమిది విడుతలుగా 277 కోట్లు, జిల్లాలో 8 కోట్ల మొక్కలు నాటినట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మొగులాన్‌పల్లి తండా శివారులో అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ హరితోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్పీకర్ హాజరయ్యారు. మొగులాన్‌పల్లి శివారులో 10 హెక్టార్లలో 11వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని డీఎఫ్‌వో నిఖితతో కలిసి ప్రారంభించారు. అనంతరం అటవీశాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సభాపతి పోచారం మాట్లాడుతూ.. మానవ జాతికి చెట్లు తల్లితో సమానమని అన్నారు. మానవ మనుగడకు చెట్లు అండగా ఉంటాయని పేర్కొన్నారు. పచ్చదనం ఎక్కడ ఉంటే అక్కడ వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగుంటాయని తెలిపారు.రాష్ట్రంలో 2.50 కోట్ల హెక్టార్లలో అటవి విస్తీర్ణం ఉన్నదని, అడవులను ధ్వంసం చేస్తే వాతావరణంలో సమతుల్యం లోపించి మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందని అన్నారు. అడవులను నరికివేయడంతో కోతులు, ఇతర అటవీ జంతువులు గ్రామాల్లోకి వస్తున్నాయన్నారు. అడవులను కాపాడాలని, హరితహారంలో నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని కోరారు.

**త్వరలో పోడుపట్టాల పంపిణీ**

ఉమ్మడి జిల్లాలో త్వరలోనే 2,104 మంది పోడు రైతులకు పట్టాలను పంపిణీ చేస్తామని స్పీకర్ తెలిపారు. తెలంగాణ హరితోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అంతకుముందు జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను స్పీకర్ ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిప్లిబాయి, ఆర్డీవో రాజాగౌడ్, బాన్సువాడ అటవీశాఖ అధికారి సంజయ్‌గౌడ్, ఎంపీపీ దొడ్ల నీరజారెడ్డి, రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, తిర్మలాపూర్ సర్పంచ్ జిన్న రఘురామయ్య, బీఆర్ఎస్ నాయకులు పిట్ల శ్రీ ధర్, దొడ్ల వెంకట్రాంరెడ్డి, మల్లారెడ్డి, రాచప్ప, ఉస్మాన్, సలీం, న్యారాం, అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**బాన్సువాడ మాతాశిశు దవాఖానలో మొక్కలు నాటిన స్పీకర్**

బాన్సువాడ, జూన్ 19 : బాన్సువాడ లోని మాతాశిశు దవాఖానలో నిర్వహించిన హరితోత్సవంలో స్పీకర్ పోచారం పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, పాలకవర్గ సభ్యులు, దవాఖాన సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్, వైద్య సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం సభాపతిని వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. సొసైటీ అధ్యక్షుడు ఏర్వాల కృష్ణారెడ్డి, వైద్యులు సుధ, మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేశ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ జుబేర్, హెడ్ నర్సు ఆరోగ్య జ్యోతి, కౌన్సిలర్లు శ్రీనివాస్, ఆమేర్, హకీం, హైమద్, రవీందర్ రెడ్డి, వెంకటేశ్, కిరణ్ కుమార్, రుక్మిణి, రమాదేవి, దవాఖాన సిబ్బంది ఆనంద్, రఘు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని సొంత వాహనంలో దవాఖానకు తరలింపు
- చేష్టలుడిగి చూస్తుండి పోయిన ఎంపీ ధర్మపురి అర్వింద్


క్షతగాత్రుడిని పైకి లేపుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్, జూన్19: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడగా ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. అతడిని పైకి లేపి తన వాహనంలో దవాఖానకు తరలించారు. అక్కడే ఉన్న నిజామాబాద్ ఎంపీ అర్వింద్ మాత్రం అలా చూస్తుండిపోయారు తప్పితే సాయం చేసేందుకు ముందుకు రాలేదు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామ శివారులో సోమవారం మునిపల్లికి చెందిన గాదెపల్లి చిన్న గంగారెడ్డి వాహనం పైనుంచి అదుపు తప్పి కింద పడ్డాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎంపీ అర్వింద్ తన వాహనాన్ని ఆపి అలా చూస్తుండి పోయారు. మరోవైపు, అదే మార్గంలో వచ్చిన ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి హుటాహుటిన తన వాహనం దిగి గాయపడిన గంగారెడ్డి వద్దకు స్వయంగా వెళ్లి ఆయనను పైకి లేపారు. తన వాహనంలో దవాఖానకు తరలించారు. ఎంపీ వ్యక్తిగత సిబ్బంది కొంత సాయం చేసినా, అర్వింద్ మాత్రం దగ్గరకు రాకపోవడం గమనార్హం.


క్షతగాత్రుడిని దవాఖానకు తరలిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, పక్కన నిల్చుండి చూస్తున్న ఎంపీ అర్వింద్

# షబ్బీర్..తప్పుడు ప్రచారాలు మానుకో..


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

- ప్రజలు నాలుగుసార్లు ఓడించినా సిగ్గురాలేదు
- నాణ్యతతో డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టిస్తున్నాం..
- కావాలంటే ఇంజినీర్లను తీసుకెళ్లి పరిశీలించు..
- ఆ ఇండ్లు 50 ఏండ్ల వరకు ఉంటాయని బహిరంగ చర్చకు సిద్ధం
- ఈ నెల 22 తర్వాత ఎక్కడైనా, ఎప్పుడైనా సరే..
- విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి, జూన్ 19 : డబుల్ బెడ్ రూం ఇండ్లపై మాజీ మంత్రి షబ్బీర్ తప్పుడు ప్రచారాలు మానుకోవాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సూచించారు. ప్రజలు నాలుగు సార్లు ఓడించినా ఆయనకు సిగ్గు రాలేదని మండిపడ్డారు. సోమవారం ప్రభుత్వ విప్ జిల్లాకేంద్రంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కామారెడ్డి నియోజకవర్గానికి మొత్తం 1715 డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో 760 డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఉన్నాయని చెప్పారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో 320, మున్సిపల్ పరిధిలోని రామేశ్వరపల్లి లో 220, ఇల్చిపురంలో 50, టేక్రియాల్‌లో 50, దేవునిపల్లిలో 120 ..మొత్తం 760 ఇండ్లు మంజూరైనట్లు వివరించారు. రామేశ్వరపల్లిలో రంగులు వేయాల్సి ఉందని, పదిరోజుల్లో పూర్తిచేస్తామన్నారు. సోమవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ టేక్రియాల్ వద్ద ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లలో నాణ్యత లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఇండ్లు 50 ఏండ్ల వరకు ఉంటాయని ఇటీవల తాను సవాల్ విసిరానని గుర్తుచేశారు. ఇప్పటికిప్పుడు రావాలని పత్రికా ముఖంగా ఆయన సవాల్ విసరడం విడ్డూరమన్నారు. తాను ఆయనలా పనీ పాట లేకుండా లేనని, ఎమ్మెల్యే పదవిలో ఉన్నానని అన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ నెల 22 వరకు కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. తన సవాల్ స్వీకరించాలంటే ఈ నెల 22 తర్వాత తేదీ ఇవ్వాలని.. అప్పుడు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తానని స్పష్టం చేశారు. గతంలో 2018 లో ఆస్తుల విషయంలో కామారెడ్డి గంజ్‌లో సవాల్ విసిరినప్పుడు రాకుండా తప్పించుకున్నాడని అన్నారు. కామారెడ్డి ప్రజలు షబ్బీర్ అలీని నాలుగుసారు ఓడించినా సిగ్గు రాలేదని అన్నారు. పదేండ్లు మంత్రిగా పని చేసిన ఆయన ఇండ్ల నాణ్యత చూడాలంటే ఇంజినీర్లను తీసుకెళ్లాలని, మేస్త్రీలను తీసుకెళ్లడం ఏంటని ప్రశ్నించారు. ఇండ్లను బీఆర్ఎస్ కార్యకర్తలకు ఇచ్చామని తప్పుడు ప్రచారం చేస్తున్నావని, కాంగ్రెస్ కార్యకర్తలకు కూడా డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇచ్చామని తెలిపారు. దీనికి ఆయన సమాధానం చెప్పాలన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాటు లేకుండా కలెక్టర్, అధికారులు, గ్రామస్తుల సమక్షంలో డ్రా తీశామని అన్నారు. పార్టీ అధిష్టానాన్ని నమ్మించాలనే ఉద్దేశంతో తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాడని అన్నారు. తనకు టికెట్ దక్కదనే ఇలాంటి నీచ రాజకీయాలు పాల్పడుతున్నారని మండిపడ్డారు. తన నిజాయితీని వేలుపెట్టి చూపించే హక్కు లేదన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లలో 30 శాతం కమీషన్ తీసుకున్నానని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో గెలవాలంటే ప్రజల కాళ్లు మొక్కి గెలవాలి తప్ప ఇలాంటి నీచ రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో మైనార్టీ యువకుల చేరిక


గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్, జూన్ 19: బీఆర్ఎస్‌లోకి వలసలు జోరుగా కొనసాగుతున్నాయి. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, చేపూర్ గ్రామ మైనార్టీ యువకులు సోమవారం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకుడు షాహిద్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మున్నా, సీనియర్ నాయకుడు పండిత్ పవన్, నాయకులు అమీర్‌ఖాన్, సద్దాం, ముజాహిద్‌ఖాన్, రిజ్వాన్, అసఫియాన్, ఆదిల్ అఫ్రోజ్, డేనిష్, అద్నాన్ , ఇర్షాద్, అబీరార్, అల్బాక్స్, రవికిరణ్, దీపక్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సోమవారం హరితోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ఉత్తమ మున్సిపాలిటీలకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అవార్డులను ప్రదానం చేశారు. ఉత్తమ సేవ మున్సిపాలిటీ అవార్డును మంత్రి చేతులమీదుగా కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి, కమిషనర్ దేవేందర్ అందుకున్నారు.
–కామారెడ్డి, జూన్ 19